
శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

సంక్రాంతి సందడి

● కళకళలాడుతున్న గ్రామాలు ● జనసంద్రంగా ప్రధాన రహదారులు, కూడళ్లు


ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

నరసన్నపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సందడి నెలకొంది. అన్ని పండుగలు కన్నా.. సంక్రాంతికి ఓ ప్రత్యేకత ఉంది. కాలగమనంలో ఎన్నిమార్పులు వచ్చినా సంక్రాంతి శోభ మాత్రం మసకబారదు. ముంగిట్లో భోగిమంట.. వాకిట్లో ముగ్గులు.. రైతన్నల లోగిళ్లలో ధాన్యపురాశులు .. పసుపు కుంకములు అద్దుకున్న గొబ్బెమ్మలు.. హరిదాసు కీర్తనలు.. జంగమ దేవర దీవెనలు.. గంగిరెద్దులు, పిండివంటలు ఘుమఘుములు... పేకాటలు.. పిల్లలు కేరింతలు.. ఇవన్నీ సంక్రాంతి పండుగలో చోటుచేసుకునే దృశ్యాలు. ప్రధానంగా పల్లెల్లో సంక్రాంతి సంబరాలే వేరు. ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన వలస జీవులు ఎక్కడ ఉన్నా.. సంక్రాంతిని పురస్కరించుకునేందుకు స్వగ్రామాలకు చేరుకుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులతో సరదాగా గడుపుతారు. తొలిరోజు భోగిమంటలు వేసి కొత్త జీవితాలకు శ్రీకారం చుడతారు. రెండో రోజు పితృదేవతలకు పూజిస్తారు. మూడో రోజు పశువులకు శుభాకాంక్షలు చెప్పే కనుము, మరుసటి రోజున చిన్నపిల్లలు పండుగగా జరుపుకునే ముక్కకనుముతో సంక్రాంతి ఉత్సవాలు ముగుస్తాయి. ఇప్పటికే వలసజీవులు స్వగ్రామాలకు చేరుకోగా.. పల్లెలు కళకళలాడుతున్నాయి. ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్లు జనాలతో రద్దీగా మారాయి.



పలాస రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికులు..

నేడు భోగి..

పండుగ మూడు రోజుల్లో మొదటిది భోగి. సోమవారం భోగి పండుగను జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. వేకువజామునే భోగి మంటలు వేసి.. భోగభాగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు సిద్ధించాలని ప్రజలంతా కోరుతుంటారు. ఇంట్లో ఉన్న పాత చీపుర్లు, తట్టలు, విరిగిపోయిన వస్తువులు మంటల్లో వేసి కొత్త జీవితాన్ని ప్రసాదించాలని వేడుకుంటారు. కొన్ని ఇళ్లలో ఇదే రోజున పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరిస్తారు. భోగి పండ్లు పిల్లల తలపై పోస్తారు. దీనివల్ల పిల్లలకు దిష్టి తగలకుండా ఉంటుందని గ్రామీణుల నమ్మకం. అలాగే మంగళవారం సంక్రాంతి పండుగ చేసుకోనున్నారు. ఆ రోజున ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుణ్యకాలం ఉందని పండితులు తెలిపారు. బుధవారం నాడు కనుమ పండుగ చేసుకోను న్నారు. ఆ రోజున రైతులు పశువులను పూజిస్తారు. 16న ముక్కనుమ నిర్వహిస్తారు. సంప్రదాయం ప్రకారం చిన్నారులకు చెవులు, ముక్కు కుట్టించడం వంటివి చేస్తారు.

ప్రయాణికుల రద్దీ..

● రైల్వేస్టేషన్లు, కాంప్లెక్స్‌ల్లో కిటకిట

పలాస/ ఆమదాలవలస, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో జిల్లాలో ఎక్కడ చూసినా ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది. ఆదివారం పలాస, ఆమదాలవలస రైల్వేస్టేషన్లు(శ్రీకాకుళం రోడ్డు), శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌తోపాటు తదితర బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. పలాసలో ఉదయం సికింద్రాబాద్ నుంచి వచ్చిన ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ రైలులో వందల సంఖ్యలో ప్రయాణికులు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు చేరుకున్నారు. పలాస, టెక్కలి డివిజన్లకు సంబంధించి వలస కూలీలు ఎక్కువగా సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో ఉన్నారు. వారంతా సొంత గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు జరుపుకోవడానికి భారీ సంఖ్యలో తరలిరావడంతో రైల్వేస్టేషన్ కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం వచ్చిన విశాఖ, హౌరామెయిల్‌లో కూడా సాధారణ రోజుల కంటే రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులు తరలివచ్చారు. అలాగే ఆమదాలవలస రైల్వేస్టేషన్ కూడా చెన్నై, సికింద్రాబాద్, తిరుపతి, విజయవాడ, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చే ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. రైల్వేస్టేషన్ల నుంచి ఆటోలు, కారులు, బస్సులు, ప్రైవేటు వాహనాల్లో స్వగ్రామాలకు చేరుకున్నారు. వాహనాల రాకపోకలు అధికమవడంతో కొన్నిచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి.


ప్రాథమిక పాఠశాలలో..

నందిగాం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ముందస్తు భోగి పండుగ నిర్వహించారు. ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు భోగిమంట వేసి సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.గున్నయ్య, బి.శంకరరావు, వి.కుమారి, పి.వనిత పాల్గొన్నారు.

వైభవంగా 'రథసప్తమి' నిర్వహిద్దాం

● పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

● కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో శ్రీసూర్యభగవానుడి 'రథసప్తమి' వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిద్దామని కేంద్రపౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. రథసప్తమిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిన నేపథ్యంలో.. పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 4 నుంచి మూడు రోజులపాటు రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం అరసవల్లిలో ఆలయ ప్రాంగణాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి మంత్రులు సందర్శించారు. ఇంద్ర పుష్కరిణి, క్యూలైన్లు, మాఢవీధులను పరిశీలించారు. రథసప్తమి ఏర్పాట్లపై సమీక్షించారు. అలాగే ఆలయ ఆవరణలో తొలగించాల్సిన కట్టడాలకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ప్రతి భక్తుడికీ దర్శనం కల్పించాలి

రథసప్తమి వేడుకల్లో ప్రతి భక్తుడికీ ఆదిత్యుడి దర్శనం కల్పించేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. అధికారులతో సమీక్షలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. 'రథసప్తమి వేడుకలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి కూడా దాదాపు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి. ప్రతి భక్తుడికీ సులభతర దర్శనం లభించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. గతంలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా పోలీసు బందోబస్తు, పారిశుద్ధ నిర్వహణ, భక్తులకు తాగునీరు, (మిగతా 6వ పేజీలో..)

● మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తిరుపతిలో మాదిరిగా భక్తులు వేచి ఉండేందుకు గదులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక ఆకర్షణగా మూడురోజుల పాటు శ్రీకాకుళంలో హెలీకాప్టర్ చక్కెర్లు కొడుతుందని.. అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యానికి తావులేకుండా సమష్టిగా అన్ని శాఖలు పనిచేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా.. ఏర్పాట్లలో భాగంగా దుకాణాలు తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు విన్నవించారు. దీనిపై చర్యలు తీసుకుంటామని.. ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.


ఇంద్ర పుష్కరిణి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, అధికారులు



శ్రీకాకుళం : అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

వివేకానందుడి స్ఫూర్తితో 'వికసిత్ భారత్'

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ● ఘనంగా జయంతి

6లో



మా ఇసుక.. మా ఇష్టం

ఆకులతంపరలో ఇసుక తవ్వకాల వల్ల నది మధ్యలో గోతులు..



● బరితెగిస్తున్న అక్రమార్కులు ● జిల్లాలో అక్రమంగా ఇసుక తవ్వకాలు

● రాత్రుళ్లు ట్రాక్టర్లలో తరలించి తోటల్లో నిల్వలు

● ఉదయం లారీల్లో ఇతర ప్రాంతాలకు రవాణా

● అధికారపార్టీ నేతల అనుచరులే దందా

● పట్టించుకోని అధికారులు

'ఆ ఇసుకా మాదే.. ఆ కుప్పలూ మావే'.. అంటూ ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. జిల్లాలోని వంశధార, నాగావళి నదుల్లో ఇసుక ర్యాంపులను ప్రభుత్వం గుర్తించింది. కొన్నిచోట్ల ర్యాంపులకు అనుమతులిచ్చి.. నిబంధనలు విధించింది. కానీ 'మా ఇసుక.. మా ప్రాంతం.. మేమే నాయకులం.. మాకు మాత్రమే హక్కు ఉంది' అంటూ అధికారపార్టీకి చెందిన కొంతమంది నేతలు, వారి అనుచరులు పెత్తనం చెలాయిస్తూ ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. విశాఖపట్నానికి లారీల్లో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కలెక్టర్ హెచ్చరికలను సైతం బేఖాతరు చేస్తున్నారు.

శ్రీకాకుళం, జనవరి 12(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. తమ ప్రాంతంలో ఇసుక.. తమ ఇష్టం అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలోకి తొక్కి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు. అధికారిక ర్యాంపుల్లో ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకే తవ్వకాలు చేపట్టాలనే నిబంధన ఉంది. కానీ, రాత్రిళ్లు యంత్రాలతో వచ్చి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి విశాఖ, ఒడిశా వంటి ప్రాంతాలకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కొత్తూరు, హిరమండలం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో ఇసుక దందా హెచ్చుమీరింది. ఓ నియోజకవర్గంలో అయితే.. అధికారపార్టీ నేత కూడా అదుపు చేయలేని పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల అధికారపార్టీ నేతల అనుచరులే దర్జాగా ఇసుకను విక్రయిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. అన్ని రీచ్‌ల్లో చినబాబులు.. పెదబాబుల పేర్లు మార్మోగుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.


ఆమదాలవలస ప్రాంతంలో ఇసుక అక్రమ నిల్వలు

కొత్తూరు, హిరమండలంలో..

జిల్లాలో అత్యధికంగా ఇసుక నిల్వలు కలిగిన నియోజకవర్గం పాతపట్నం. ఈ నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం మండలాల గుండా వంశధార ప్రవహిస్తుంటుంది. ఇది ఇసుకాసురులకు కలిసి వచ్చింది. కొత్తూరు మండలంలోని నివగాం, ఆకులతంపరలో ఇసుక ర్యాంపులను అధికారికంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ రాత్రివేళ తవ్వకాలు నిషేధం. కానీ, ఈ నిబంధన అమలు కావడం లేదు. రాత్రి వేళ ఇసుక తవ్వకాలు చేపట్టి సమీపంలోని ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి మండలానికి చెందిన పొన్నుటూరు, గారబంద, గోసాని గ్రామాల సరిహద్దులకు ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. అక్కడ భారీగా కుప్పలు వేసి ప్రతిరోజూ అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే, హిరమండలంలోని అంబావిల్లి, భగీరథపురంలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ నుంచి లారీల్లో ఒడిశాకు తరలించి విక్రయిస్తున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పలుమార్లు ఇసుక వాహనాలను పట్టించారు. అయినా అక్రమ తవ్వకాలు మాత్రం ఆగడం లేదు.


తమ్మినాయుడుపేట వద్ద అడ్డదారిలో ట్రాక్టర్లతో ఇసుక రవాణా..

నాగావళి నుంచి అడ్డదారిలో..

ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేట, పొన్నాడ, బొంతలకోడూరు, తోటపాలెం, ముద్దాడపేట వద్ద నాగావళి నదీ తీరంలో ఇసుక నిల్వలు భారీగా ఉన్నాయి. తమ్మినాయుడుపేట వద్ద రాత్రివేళల్లో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో మరో చోటకు తరలించి నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో విశాఖకు తరలించి అమ్ముకుంటు న్నారు. అదేవిధంగా పొన్నాడ, బొంతలకోడూరు, తోటపాలెం నుంచి కూడా ఇసుక అక్రమంగా తరలిపోతుంది. ట్రాక్టర్ల ద్వారా అడ్డదారుల్లో రణస్థలం మండలం కోష్ఠ వరకు చేరుస్తున్నారు. అక్కడనుంచి హైవే మీదకు వచ్చి విజయనగరం జిల్లాలోకి వెళ్లిపోతున్నారు. ఇది నిత్యకృత్య మైపోయింది. ఇందులో అధికార పార్టీ నేతల అనుచరులతో పాటు వైసీపీకి చెందినవారు కూడా ఉన్నారు.

కలెక్టర్ తనిఖీ చేసినా మారలే..

సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం ర్యాంపు నుంచి రాత్రివేళల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు. ఇటీవల ఈ ర్యాంపును కలెక్టర్ తనిఖీ చేశారు. ర్యాంపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు లారీలను స్వాధీనం చేసుకున్నారు. అయితే, అదేరోజు ఇసుకాసురులు పురుషోత్తపురం ర్యాంపు నుంచి బిల్లులు ట్యాంపరింగ్ చేసి ఎంచక్కా విశాఖకు వాహనాలను తరలించుకుపోయారు. అలాగే ఆమదాలవలస మండలం చవ్వాకులపేట, రావాడపేట, చిట్టివలస, నిమ్మతొర్లాడ, కొత్తవలస, దూసి, తోటాడ ప్రాంతాల్లో కూడా యథేచ్ఛగా ఇసుక దందా సాగుతుంది. సమీప తోటల్లో ఇసుకను నిల్వ చేసి బయటకు విక్రయించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్రాంతి వంటకాలు.. సంప్రదాయ చిహ్నాలు

• అమిత శక్తిదాయకాలు • ప్రతి ఇంటా పిండి వంటలు • ప్రత్యేక శ్రద్ధతో తయారు చేస్తున్న గ్రామీణులు



హిరమండలం/నరసన్నపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి... తెలుగు వారి పెద్ద పండుగ. పల్లెల నుంచి పట్టణాల దాకా సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు నిర్వహించడం సంప్రదాయం. భోగి, సంక్రాంతి, కనుమ ఇలా మూడు రోజుల పాటు చేసుకునే పండుగను తలచుకోగానే చటుక్కున గుర్తించేవి పిండి వంటలు. అయినవాళ్లతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఆరగించడం.. ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవడం పల్లెల్లో సర్వ సాధారణం. పండుగ సందర్భంగా తయారు చేసుకునే జంతికలు, అప్పాలు, అరిసెలు, బొబ్బట్లు, బూరెల వంటి పిండి వంటల్లో సంప్రదాయంతో పాటు మన ఆరోగ్యానికి మేలు చేసే సుగుణాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మన పెద్దలు సంప్రదాయమంటూ ఏం చెప్పినా.. దాని వెనుక ఏదో ఒక పరమార్థం ఉండేలా జాగ్రత్త పడ్డారు. అలా సంక్రాంతికి చేసుకునే వంటలకూ ఎంతో ప్రత్యేకత ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతికి ప్రతి కుటుంబం అరిసెలు, బొబ్బట్లు, కజ్జికాయలు, వివిధ రకాల లడ్డూలు, నువ్వుల ఉండలు, వేరుశెనగ ఉండలు, మైసూర్ పాక్ వంటి మిఠాయిలతో పాటు చెక్కిలాలు, జంతికలు, మిక్చర్ వంటివి తయారు చేస్తారు. దాదాపు 20 రోజులకు పైగా నిల్వ ఉండే అత్తిరసాలు, కజ్జికాయలను పండుగ తర్వాత కూడా ఇళ్లకు వచ్చే వారందరికీ పంచుతుంటారు.

బలాన్నిచ్చే అరిసెలు



వీటి తయారికి ప్రధానంగా బియ్యం పిండి, బెల్లం, కొబ్బరి వినియోగిస్తారు. బియ్యంలో కార్బోహైడ్రేట్లు, బెల్లంలో ఇనుము(ఐరన్) సమృద్ధిగా ఉంటాయి. దీంతో రక్తవృద్ధి, శుద్ధి జరుగుతుంది. అదే మంచి ఆవు నెయ్యితో చేస్తే కొలెస్ట్రాల్ శాతం బాగా తక్కువగా ఉండటమే కాక మంచి పుష్టికరమైన ఆహారంగా కూడా పని చేస్తుంది. కొబ్బరి బలమైన ఆహారం, బియ్యం, బెల్లం త్వరగా బలాన్నిచ్చే దినుసులు. ప్రత్యేకించి బెల్లం అజీర్ణాన్ని అరికడుతుంది. రోజుకు నాలుగైదు చొప్పున తింటే ఎనలేని శక్తి సమకూరుతుంది. మనిషికి కండ పెరుగుతుంది. తక్కువ ఖర్చుతో బలమైన శక్తినిచ్చేవి అరిసెలే.

కజ్జికాయలు



కజ్జికాయలను బెల్లం లేదా చక్కెర, శనగపప్పు, కొబ్బరి, గోధుమ పిండితో తయారు చేస్తారు. బెల్లం, చక్కెరలో ఐరన్, గోధుమ పిండిలో ప్రొటీన్లు, పప్పులో కార్బోహైడ్రేట్లు ఉంటాయి. వీటిల్లో వాడే యాలకులు కూడా మంచి రుచిని ఇవ్వడమే కాదు, జీర్ణశక్తిని పెంచుతాయి. ఆకలి బాగా ఉండేలా చేస్తాయి.

బొబ్బట్లు



శనగపప్పు, బెల్లం మిశ్రమంతో బొబ్బట్లు చేస్తారు. ఈ మిశ్రమానికి పైపూతగా గోధుమ పిండి లేదా మైదా పిండిని వాడుతారు. నెయ్యితో చేసే ఈ మిఠాయిలో వేసే శనగల్లో ప్రొటీన్, కార్బోహైడ్రేట్లు దండిగా ఉంటాయి. బెల్లంలో ఉండే ఇనుము మంచి శక్తివాహకంగా పనిచేస్తుంది. గోధుమపిండి, మైదా పిండి రెండూ బలవర్థకాలే. వెరుశెనగ నూనె కంటే రుచికరమైన నెయ్యిలో కొవ్వు పదార్థాలు తక్కువ. అయితే బొబ్బట్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండవు. గరిష్ఠంగా రెండు రోజులకు మించి నిల్వ ఉంచడం మంచిది కాదు.

లడ్డు..



రుచి, శుచిలతో పాటు బలానికి మారుపేరు లడ్డు. ఇందులో చాలా రకాలు ఉన్నాయి. దాదాపుగా అన్ని రకాల్లో శనగపిండి, చక్కెర, నూనె వాడతారు. లడ్డూ మంచి బలమైన ఆహారం. ఇందులో వేసే జీడిపప్పు, బాదం ద్వారా ఫాటియాసిడ్లు, అమినోయాసిడ్లు, బీ-కాంప్లెక్స్ విటమిన్లు లభిస్తాయి. బలవర్థకంగా పని చేస్తాయి. ద్రాక్ష, కిస్మిస్‌ల ద్వారా సి-విటమిన్ లభిస్తుంది.

జంతికలు



జంతికలు, చుప్పులు, కారప్పూస ఇవన్నీ కారాల జాబితాలోవే. వీటి తయారీకి వాడే ముడిపదార్థాలు దాదాపు ఒక్కటే అయినా చేసే పద్ధతులను బట్టి రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. వీటి తయారీకి బియ్యం పిండి, శనగపిండి, మినపపిండి, మైదాలతో పాటు ఇంగువ, జీలకర్ర, వాము వంటివి వేసి నూనెలో వేయించి తయారు చేస్తారు. ఇవి తినేందుకు మంచి రుచిగా ఉండటమే కాక వాము, జీలకర్ర వంటివి జీర్ణశక్తిని పెంచుతాయి. సుమారు 20 రోజుల వరకూ నిల్వ ఉండే ఈ కరకరలాడే కారాలన్నీ అందరికీ నచ్చుతాయి. ఈ పండగకి అంతా ఇష్టంగా తినే మరో వంటకం రేగుపళ్ల పచ్చడి. పుల్లపుల్లగా.. కాస్త తీయగా.. మరికాస్త కారంగా ఉండే ఈ పచ్చడి మంచి రుచిగా ఉండటమే కాదు శరీరానికి సి-విటమిన్‌ను, శక్తిని పుష్కలంగా అందిస్తుంది.

మైసూర్ పాక్



శనగపిండి, చక్కెర, నూనె లేదా నెయ్యితో చేసే మైసూర్ పాక్ కూడా బలవర్ధకమైన ఆహారమే. ఎక్కువ కాలరీలున్న దృష్ట్యా దీన్ని కాస్త మితంగా తీసుకోవాల్సి ఉంటుంది.

అప్పాలు



బియ్యం, పల్లీ, శనగపిండి, అల్లం, వెల్లుల్లి, కరివేపాకుతో తయారు చేస్తారు. పల్లీల్లో ఐరన్ ఉంటుంది. ధాతు పుష్టికి, రక్తాన్ని పెంచేందుకు ఉపకరిస్తుంది. శక్తి ఉత్పత్తి వాహకాలుగా పనిచేస్తాయి. వెల్లుల్లి జీర్ణాశయంలో అగ్నిదీప్తిగా పనిచేస్తుంది. ఆకలిని పెంచుతుంది. మలమూత్ర బద్ధకాన్ని తొలగిస్తుంది. కడుపులో నొప్పిని తగ్గిస్తుంది.

ఎన్నప్పలు (పాకు ఉండలు)



సంక్రాంతి పండుగకు ఎన్ని పిండి వంటలు చేసుకున్నా ఎన్నప్పలు లేకపోతే ఏదో వెలితిగానే ఉంటుంది. అందుకే గ్రామాల్లో మహిళలు వీటిని సంక్రాంతి సందర్భంగా తయారు చేసి పండుగ తరువాత వారం పది రోజులు వరకు తినేవిధంగా నిల్వ చేస్తారు. పిల్లలు ఎంతో ఇష్టంగా పాకుఉండలు తింటారు. వీటి తయారీలో కొబ్బరి, బియ్యం పిండి, నువ్వులు, బెల్లం ఉపయోగిస్తారు. వీటి ద్వారా ప్రొటీన్లు, ఐరన్, ఖనిజ లవణాలు శరీరానికి అంది శీతాకాలంలో ఎటువంటి శారీరక సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు.

సున్నుండలు



సహజంగా శీతాకాలంలో చర్మం పొడి బారుతుంది. పొడిబారే చర్మాన్ని కాంతివంతంగా చేసే లక్షణమున్న పిండివంట సున్నండలు. మినప పిండి, నెయ్యి, బెల్లం కలయికతో చేసే ఈ సున్నుండులు శరీరంలో హార్మోన్లను సమతుల్యంగా ఉంచటానికి ఉపయోగపడతాయి. తెలుగు వారి ఇళ్లలో సంక్రాంతి కొత్త అళ్లుళ్లకు సున్నుండలు కొసరి కొసరి తినిపిస్తారు.



● బియ్యం వేయిస్తే మురియాలు అవుతాయి. ధాన్యం వేయిస్తే పేలాలు అవుతాయి. వీటిని బెల్లంతో కలిపి పాకం పట్టి ఎంతో చక్కగా తినడానికి ఎంతో అనుకూలంగా ఉండల్లా తయారు చేస్తారు. ఇది ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. వేకువజాము నుంచే వీటిని తమ ఇళ్ల వద్ద కుటుంబీకులతో కలిసి తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఇది బాలింతలకు ఎంతో మంచి ఆహారమని పెద్దలు చెబుతారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

రణస్థలం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): చిల్లపేటరాజాం సమీపాన ఒక తోటలో కోడి పందాలు అడుతున్నట్టు అందుకున్న సమాచారం మేరకు జేఆర్ పురం పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి పందెం ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులతో పాటు ఐదు కోళ్లు, నాలుగు బైకులు, ఎనిమిది సెల్ ఫోన్లతో పాటు రూ32,835 స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసినట్టు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. పిక్కాట, కోడిపందాలు, పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నదీ జలాలను కలుషితం చేయొద్దు

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నదీ జలాలను కలుషితం చేయొద్దని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర పర్యావరణ అధ్యాయన యాత్రలో భాగంగా ఆదివారం నగరంలోని నాగావళి నది పరివాహక ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ.. కోడి రామ్మూర్తి స్టేడియం, కొత్తబ్రిడ్జి, పాతబ్రిడ్జి వద్ద నగరంలోని మురుగునీరంతా నావావళి నదిలో కలుస్తుందన్నారు. దీనివల్ల నదీ జలాలు కలుషితం అవుతుందని, తద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతుంటుందన్నారు. ఈ విషయంలో కలెక్టర్, నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మురుగు నీటిని శుద్ధి చేసి నదిలోకి విడిచి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు, పర్యావరణ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పూజారి గోవిందరావు, రచయితల సంఘం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర క్విజ్ పోటీల విజేత నెల్లిమర్ల

కంచిలి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పెద్ద కొజ్జిరీయ గ్రామంలో స్థానిక వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీల్లో విజేతగా విజయనగరం జిల్లా నెల్లిమర్ల జట్టు నిలిచింది. ద్వితీయ స్థానంలో పూండి జట్టు, తృతీయ స్థానంలో బేతాళపురం జట్టు నిలిచింది. వీరికి నగదు ప్రోత్సాహకాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ పోటీల్లో 70 జట్లు పాల్గొన్నాయి.

యువత చేతిలో దేశభవిష్యత్

గుజరాతీపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): దేశభవిష్యత్ యువత చేతిలో ఉందని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని మాట్లాడారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బొంతు

లావేరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా ఉపాధ్యాక్షుడిగా బొంతుపేట గ్రామానికి చెందిన బొంతు సూర్యనారాయణ ఎంపికయ్యారు. ఈయన గతంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, రణస్థలం రైతుసేవా సహకార సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు.

ప్రజల ప్రాణాలు పోతే.. సంక్రాంతి సంబరాలా?

● వైసీపీ నేతలపై మండిపడ్డ ఎమ్మెల్యే కూన రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

శ్రీకాకుళం అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోతే కనీసం మానవత్వం లేకుండా వైసీపీ నాయకులు సంక్రాంతి చేసుకోవడం దుర్మార్గమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దుయ్యబట్టారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో ఉన్న జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గడిచిన ఎనిమిది నెలల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. శ్రీవారి టిక్కెట్లు అమ్ముకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి రోజాపై తక్షణమే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. గోదావరి బోటు ప్రమాదంలో, అన్నమయ్య డ్యాంలో కొట్టుకుపోయి సుమారు 32 మంది చనిపోయినా పరామర్శించని అప్పటి సీఎం జగన్‌రెడ్డి.. నేడు వేదాలు వల్లించడం హాస్యాస్పదమన్నారు. జగన్ చేసిన నేరాలు, మోసాలకు ప్రజలను క్షమాపణ చెప్పాలని, లేకుంటే పార్టీ క్లోజ్ చేసుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

జిల్లా ప్రజలు సంతోషంగా పండగ జరుపుకోవాలి

● శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

శ్రీకాకుళం, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు ఆనందంగా సంతోషంగా భోగి, సంక్రాంతి పండగను జరపుకోవాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. అలాగే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సాయి భక్తుల గ్రామసేవ

గార జనవరి 12(ఆంధ్రజ్యోతి): గోరువానిపేటలో భగవాన్ సత్యసాయిబాబా భజన మండలి భక్తులు ఆదివారం గ్రామంలో దేవాలయాలు పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.



గార సంతకు సంక్రాంతి కళ

గార జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో మంగళవారం గారలో జరగాల్సిన వారపు సంతను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద పండగకు అవసరమై చెరకులు కొత్త బట్టలు, కూరలు, బెల్లం, అరటి పండ్లు మొదలైన సరుకులు ఎక్కువగా కొనుగోలు చేశారు. ముఖ్యంగా పెద్దలు పండగకు ముఖ్యంగా అవసరమైన కొత్త కుండలు కొనుగోలు చేశారు. దీంతో కొనుగోలుదారులతో గార సంతకు సంక్రాంతి కళ కొట్టొచ్చినట్టు కనిపించింది.

జిల్లా ఉత్తమ యువ సంఘ సేవకుడిగా తేజ



కేంద్ర మంత్రి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న తేజ

రణస్థలం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బంటుపల్లి గ్రామానికి చెందిన మహాలక్ష్మి యూత్ క్లబ్ అధ్యక్షుడు, ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ నడుకుదిటి తేజకు జిల్లా ఉత్తమ యువ సంఘ సేవకుడిగా గుర్తిరపు లభించింది. ఈ మేరకు నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఆదివారం జరిగిన జాతీయ యవజనోత్సవాల్లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతుల మీదగా ప్రశంసా పత్రం తేజ అందుకున్నాడు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తనయుడుగా నియోజకవర్గంలో పలు సేవా కార్యాక్రమాలు చేసి, ఆపన్నలను ఆదుకోవడంలో తేజాకు జిల్లా స్థాయిలో గుర్తింపు లభించింది. ఇది మరింత బాధ్యత పెంచిందని అవార్డు గ్రహీత తేజ అన్నారు. ఎమ్మెల్యే గొండ శంకర్, ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల్, మేడూరి ప్రసాదరావు తేజాను అభినందించారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోరా?



బాహుదానదిలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్న దాసరి రాజు

ఇచ్ఛాపురం జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బాహుదా నది వంతెన పక్కనే ఇసుక బకాసురులు పట్టపగలే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా రెవెన్యూ, అధికారులు పట్టించుకోకపోవడంపై జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు ధ్వజమెత్తారు. ఆదివారం మధ్యాహ్నం సుమారు 10 ట్రాక్టర్లు ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. గమనించిన రాజు ఇసుక అక్రమ రవాణా ఆపాలని వారికి కోరారు. బాహుదాలో అక్రమ ఇసుక తవ్వకాలు వలన వంతెనకు ప్రమాదం ఉందని ఇదివరకే ఎన్నోసార్లు మొత్తుకున్నా అప్పుడు అధికారులు పట్టించుకోకపోవడంతో గతంలో వంతెన సంగభాగం కూలిపోయిందన్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించకపోతే ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు.

నిరంతర సాధనతోనే గెలుపు



మాట్లాడుతున్న మాజీ మంత్రి శివాజీ

సోంపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో విజయాలు దక్కాలంటే క్రీడాకారులు నిరంతర సాధన చేయాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ గ్రౌండ్‌లో ఎస్‌సీసీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర డే-నైట్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ మంత్రి గౌతు శివాజీతో కలిసి ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో జయాపజయాలు సహజమని వాటిని సమానంగా చూడాలన్నారు. క్రీడల వలన మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. అలాగే పోలీసులు ఏర్పాటు చేసిన డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎంఎ ప్రతినిధులు ఎస్.రాజేంద్రప్రసాద్, మంచు ప్రదీప్, కూటమి నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, చిత్రాడ శేఖర్, దుద్ది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేడుకలు

ఇచ్ఛాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ శివానందగిరి కొండపై నేటి నుంచి సంక్రాంతి వేడుకలు జరిపేందుకు త్రినాథస్వామి దేవాలయం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 13 నుంచి 15వరకు భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలు ఘనంగా జరుపునున్నారు. 13న (సోమవారం) భోగి సందర్భంగా ముగ్గుల పోటీలు, 14న సంక్రాంతి పురష్కరించుకొని గాలి పటాల పోటీలు, 15న కనుమ సందర్భంగా సామూహిక మేళా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

గోదా రంగనాథుల కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో శివబాలాజీ ఆలయంలో ధనుర్మాస వ్రతం ముగింపు సందర్భంగా ఆదివారం గోదారంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆగమశాస్త్ర పండితులు చామర్తి జగన్నాథాచార్యులు, చామర్తి సీతారామచార్యులు, ఆలయ అర్చకులు గోపినంబాల వెంకట సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి చేయూత

ఆమదాలవలస, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూతను అందిస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం తోటవాడలో నూతన విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. కొత్తవలస గ్రామంలో మినీ గోకులాన్ని ప్రారంచి మాట్లాడారు. ఎంపీడీవో రోణంకి వెంకటరావు, పశుసంవర్థకశాఖ ఏడీ ఆర్.ఆనందరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల శ్రేయస్సే ధ్యేయం

ఆమదాలవలస, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో కార్మికులకు దుస్తులు, సబ్బులు చెప్పులు, కొబ్బరినూనె తదితర వస్తువులను పంపిణీ చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం పరిశీలన

ఎచ్చెర్ల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ముద్దాడపేట ఎత్తిపోతల పథకాన్ని ఇరిగేషన్ అధికారులు ఆదివారం పరిశీలించారు. ఈ ఎత్తిపోతలకు అడ్డంగా ఉన్న ఇసుక మేటలను తొలగించి, నిరాటంకంగా సాగునీరు సరఫరాకు కావల్సిన ప్రతిపాదనలు రూపొందించేందుకు డీఈఈ వై.రవీంద్ర, జేఈ కె.దాలినాయుడు పరిశీలించారు. కార్యక్రమంలో నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి సత్యనారాయణ, ప్రస్తుత ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రతి పంపిణీ

శ్రీకాకుళం అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రెల్ల సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం అసెంబ్లీ స్థాయిలో రాజ్యాంగ ప్రతిని పంపిణీ చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువను తగ్గించేలా అనుసరుస్తున్న విధానాలను నిరసిస్తూ స్థానిక పొట్టి శ్రీరాముల మార్కెట్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంబటి దాలినాయుడు, చాంద్ బాషా, షాదుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పాతపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉప్పర వీధికి చెందిన రవ్వ కృష్ణారావు ఆదివారం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కృష్ణారావును అదే వీధికి చెందిన ఇద్దరు పదేపదే సుగర్, బీపీ ఉందని, నీవు ఎందుకూ పనికిరావని హేళన చేస్తుండడంతో మనస్తాపానికి గురై చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో స్థానిక అయ్యప్ప స్వామి గుడి కింద నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో గ్రామస్థులు చూసి గాయపడిన కృష్ణారావును స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫార్సుమేరకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కృష్ణారావు నుంచి వాంగ్మూలం తీసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జలుమూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అబ్బాయిపేట కూడలి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చల్లవానిపేట నుంచి ఎర్రన్నపేట ద్విచక్రవాహనంపై వెళుతుండగా సారవకోట నుంచి నరసన్నపేట వైపు వెళుతున్న మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఎర్రన్నపేటకి చెందిన కూన చిలకయ్య (55) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని 108 వాహనంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు చిలకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

ఫుట్‌పాత్‌పైకి దూసుకువెళ్లిన కారు

జలుమూరు (సారవకోట) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సారవకోటలో ఆదివారం కారు ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లడంతో ఇరువురు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపినవివరాలిలా ఉన్నాయి.. పర్లాకిమిడి నుంచి నరసన్నపేట వైపు వెళుతున్న ఒడిశాకు చెందిన కారు డ్రైవర్ నిద్రమత్తులో సారవకోటలో మటన్ వ్యాపారం చేసుకుంటున్న వారిపైకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో వ్యాపారి సారవకోట లక్ష్మికి కుడికాలుకు, పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు జయమ్మ తలకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

బెల్లం ఊట, సారా ధ్వంసం

కొత్తూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జన్నడగూడ కొండల ప్రాంతాల్లో వెయ్యి లీటర్ల బెల్లం ఊట, వంద లీటర్ల సారాను పట్టుకొని ఆదివారం ధ్వంసం చేశారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ ఎండీ అమీర్‌ఆలీ, సిబ్బంది తిరుపతిరావు తెలిపారు.

జీవో 30 పునరుద్ధరించాలి

కోటబొమ్మాళి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్‌సీ పాలసీ అమలు చేసేందుకు గాను 2019లో టీడీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 30ని పునరుద్ధరించాలని ఆ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు ఆదివారం టీడీపీ కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో 30ని వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేసిందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడని సమస్యలను పరిష్కరించాలన్నారు. 2019, 2024 పే రివిజన్ చేయాలని, డీఎల్ఎస్ఎఫ్ ద్వారా ఇవ్వాల్సిన జీతాలను ఫండ్ ఏర్పాటు చేయాలని, 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు రిటైర్మెంట్ వయసు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. గ్రాట్యుటీ రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచాలని, 2019 తరువాత సంఘాల్లో జాయిన్ అయిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మంత్రిని కోరారు.

జానపద కళలను కాపాడుకోవాలి: శిరీష

వజ్రపుకొత్తూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రాజాంలో సిక్కోలు జానపద కళాజాత ఆదివారం నిర్వహించారు. ప్రతి ఏటా సిక్కోలు కళాజాత పేరుతో కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గద్దర్ నర్సన్న, వంగపండు ఉష తదితరులు గీతాలను ఆలపించి ఉర్రూతలూగించారు. రాజాం యువకులు జానపద నృత్యాలు, తప్పెట గుళ్ల, అమ్మవారి పాటలు, కోలాటం, జముకులపాట, బోనెల పాటలు, థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహక అధ్యక్షుడు రాపాక ధనరాజు, డా.మల్లేశ్వర రావు, కుమార్ నాయక్, మాజీ ఎంపీపీ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పలాసరూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస శాఖా గ్రంథాలయంలో ఎర్రన్న విద్యాసంకల్పంలో భాగంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అందించిన పోటీ పరీక్షల పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పుస్తకాలను వినియోగించుకుని పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచాలని కోరారు. అంతకు ముందు వివేకానందుడు, గౌతు లచ్చన్న, ఎర్రన్నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, కుత్తుమ లక్ష్మణకుమార్, దువ్వాడ శ్రీకాంత్, ఎంపీడీవో వసంత్‌కుమార్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్ రాజు, లైబ్రేరియన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంపల్లిలో జానపద కళాజాత

వజ్రపుకొత్తూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంపల్లి గ్రామంలో సోమవారం భోగి సందర్భంగా ప్రజా నాట్యమండలి, గిడుగు రామమూర్తి జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జానపద కళాజాత నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జానపద కళాప్రదర్శనలు, నృత్యాలు, సంక్రాంతి సంబరాల పాటలు, ఆటలు నిర్వహిస్తున్నామన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై హర్షం

మెళియాపుట్టి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం రూ.788 కోట్లను కూటమి ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమని టీఎన్ఎస్ఎఫ్ పాతపట్నం నియోజక వర్గ జనరల్ సెక్రటరీ జొన్న హేమసుందరరావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేయగా కూటమి ప్రభుత్వం వారి భవిష్యత్‌కు భరోసా ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వానికి విద్యార్థులు రుణపడి ఉంటారన్నారు.

ఆ కుటుంబాలకు భోగి నాడే పెద్దపండుగ

నందిగాం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు భోగి నాడే పెద్ద పండుగను చేపడతారు. నందిగాంకు చెందిన అప్పిని, సింగుపురానికి చెందిన తాడి, తుంగాన కుటుంబీకులు, కోటిపల్లిలో తాడేల, సబ్బి తదితర కుటుంబాల వారు అనాదిగా భోగి నాడే పండగను నిర్వహిస్తున్నారు తాత, ముత్తాతల నుంచి వచ్చే ఈ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నామని వారు తెలిపారు. తమ బంధువులను ఆహ్వానించి భోగి నాడే సంక్రాంతిని నిర్వహిస్తున్నామని సింగుపురానికి చెందిన తాడి సింహాద్రి నాయుడు తెలిపారు.

సింగుపురం గ్రామం



పర్యాటక రంగానికి ప్రాధాన్యం

● మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి: బీటీ రోడ్డు శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పర్యాటకరంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కొత్తపేటలో రిపీటర్ కేంద్రం వరకు రూ.4 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంపై దృష్టి సారించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు అనుసంధానం ఉండేలా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కొత్తపేట కొండను వ్యూ పాయింట్‌లా తయారు చేస్తున్నామన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ● స్థానిక ఎన్టీఆర్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పథకంలో భాగంగా నాలుగు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. వీటిని రావివలస, నిమ్మాడ, తిలారు గ్రామ పంచాయతీలకు అందించారు. ● సీఎంఆర్ఎఫ్ నుంచి 15 మందికి మంజూరైన రూ.36,98,774 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వైద్యపరంగా అవసరమైన పేదలకు సీఎంఆర్ఎఫ్ వరంలాంటిదన్నారు. అవసరమైన వారికి సకాలంలో చికిత్స కోసం ఎంత మొత్తంలో ఖర్చు పెట్టడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నేతలు బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, బగాది శేషు తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైతు సంక్షేమమే ధ్యేయం: ఎంజీఆర్



సీసీ రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

హిరమండలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గులుమూరు, అవలంగి, కల్లట గ్రామల్లో సుమారు రూ.కోటితో నిర్మించిన సీసీ రోడ్లను, మినీ గోకులాలను ఆదివారం ప్రారంభించారు. పాడి పరిశ్రమాభివృద్ధి కృషి చేస్తానన్నారు. గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో రహదారులు అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యాళ్ల నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ ఏడీ రాజశేఖర్, తహసీల్దార్ హనుమంతురావు, ఎంపీడీవో కాశీ ప్రసాదరావు, ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి: బగ్గు

జలుమూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే మినీ గోకులాలను మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేటలో నిర్మించిన మినీ గోకులం షెడ్‌ను ఆదివారం ప్రారంభించారు. జలుమూరు నుంచి సుబ్రమణ్యపురం, బుడితి వరకు రూ.కోట్లతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ మంద లోకనాథం, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పశువైద్యాధికారులు ఎం.దీప్తి, సంతోష్, చల్లవానిపేట సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, ఎంపీపీ వాన గోపి, జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, టీడీపీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

హరిపురం, జనవరి12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి బాటలో సాగుతున్నా యని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం వీరభద్ర గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను, హరిపురంలో మినీ గోకులాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం మందసలో ఉపాధ్యాయుడు కేశవరావు ఏర్పాటు చేసిన వివేకానంద స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణంతో పాటు రైతుల కు సకాలంలో అమ్మిన ధాన్యానికి డబ్బులు నగదు జమ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరక్టర్ బావన దుర్యోధన, టీడీపీ నాయకులు రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, పుల్లా వాసు, దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి స్ఫూర్తితో 'వికసిత్ భారత్'

● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు తదితరులు



కంచిలి: వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న విప్ అశోక్

శ్రీకాకుళం కల్చరల్/ రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భారతదేశ ఔన్న త్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన స్వామి వివేకానందుడి స్ఫూర్తితో 'వికసిత్ భారత్' కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ రూపొందించారని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్వామి వివేకానంద జయంత్యుత్సవాన్ని యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం, నెహ్రూ యువ కేంద్రం, సెట్‌శ్రీ సంయుక్తంగా అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద ఆశయాన్ని యువతకు అనుసంధానించడం ద్వారా 'వికసిత్ భారత్' సాధ్యమవుతుందన్నారు. యువతలో దాగి ఉన్న అపారమైన శక్తిని మేల్కొల్పేందుకు వివేకానంద మాటలు ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. అలాగే నగరంలోని సూర్యమహల్ జంక్షన్‌లో స్వామి వివేకానంద జయంతిని సెట్‌శ్రీ, నెహ్రూ యువ కేంద్రం, జేసీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. సింగుపురంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎస్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ కె.ఉజ్వల్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, వివేకానంద స్వామి వేషధారణలు ఆకట్టుకున్నాయి. అలాగే జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన వివేకానంద జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, విప్ బెందాళం అశోక్ పాల్గొన్నారు. వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వివేకానంద స్వామిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.



ఆకట్టుకున్న వివేకానంద స్వామి వేషధారణ



మందస: కొత్తవీధిలో వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష



జలుమూరు: అలుదులో వివేకానందుని చిత్రపటానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

న్యూస్ బాక్స్

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

టెక్కలి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రావివలసలో నియోజకవర్గ స్థాయి అండర్- 19 కబడ్డీ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల నుంచి 24 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేలా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

పలాస, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం కాలనీలో తిరుపతిరావు మెమోరియల్ క్రికెట్ పోటీలను మున్సిపల్ మాజీ చైర్మన్, జనసేన నాయకుడు కోత పూర్ణ చంద్రరావు ఆదివారం ప్రారంభించారు. యువత చెడువ్యసనాలకు పోకుండా క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బి.కిషోర్, శంకర్, లక్ష్మణరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులకు అదనపు వసూళ్లు

పలాసరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా అందజేస్తున్న కంది పప్పు, పంచదారలపై రూ.3 చొప్పున అదనపు మొత్తం వసూలుచేయడంపై కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాలు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కొన్ని ప్రాంతాల్లో రేషన్ వాహనాల ద్వారా అందిస్తున్న సరుకుల్లో రూ.67కు అమ్మాల్సిన కందిపప్పు రూ.70, రూ.17కు అమ్మాల్సిన పంచదార రూ.20కి ఇచ్చారని, దీనిపై సిబ్బందిని లబ్ధిదారులు అడిగితే అంతే రేటు అని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొన్ని చోట్ల చిల్లర సమస్య ఉందంటూ వాహన డ్రైవర్ చెప్పడం విశేషం. ఈ విషయమై డీటీ మురళీధర్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

పండగ కళ వచ్చేసింది

● కిటకిటలాడిన పట్టణాలు
● విద్యుద్దీపాలతో కళకళ
● స్వగ్రామాలకు చేరుకుంటున్న వలస జీవులు
● సామగ్రి కొనుగోలుతో మార్కెట్ కిటకిట

పలాస/నరసన్నపేట/పలాసరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కళ పట్టణాలు, గ్రామాలకు వచ్చేసింది. పిల్లలకు సెలవులు ప్రకటించడంతో దూర ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు తరలివచ్చారు. ఆదివారం బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. సంక్రాంతికి అవసరమైన దుస్తులు, సామగ్రిని కొనుగోలు చేసుకునేందుకు పట్టణాలకు గ్రామాల ప్రజలు తరలిరావడంతో పట్టణాల్లోని రోడ్లు, మార్కెట్లు కిటకిటలాడాయి. కూరగాయలు, పండ్లు ఇతర వస్తువుల ధరలకు రెక్కలు వచ్చాయి. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భోగి మంటలు వేసేందుకు వీధులు, గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు.



కొనుగోలుదారులతో నరసన్నపేట గాంధీబజారు



పలాస: మెరిసిపోతున్న రాజీవ్ జంక్షన్

పలాస పట్టణంలోని ప్రధాన కూడళ్లను విద్యుద్దీపాలతో అలంకరించారు.



టెక్కలి: కొల్లివలసలో వేసిన భోగి మంట



పలాసరూరల్: మండల కాంప్లెక్స్ సమీపంలో భోగికి ఏర్పాటు చేసిన దుంగలు



పలాస: కూరగాయల మార్కెట్ వద్ద రద్దీ

వైభవంగా 'రథసప్తమి' నిర్వహిద్దాం

(మూడో పేజీ తరువాయి)

మరుగుదొడ్లు.. ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి. చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాల'ని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ రథసప్తమికి సమాయత్తం అవుతున్నామని తెలిపారు. డోనర్ పాస్ ఉన్న వారికి ఈ నెల 20 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించామని వెల్లడించారు. పాస్‌లు కలిగి ఉన్న వారంతా ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. శ్రీకాకుళం నగరానికి చెందిన భక్తులు సాయంత్రం సమయంలో దర్శనాలకు వచ్చేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. తద్వారా ఒకే సమయంలో వచ్చే రద్దీని నియంత్రించి దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భద్రాజీ, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జి, దేవదాయశాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలు



క్రీడాకారులతో నిర్వాహకులు

పలాస, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండురోజులుగా ఈ పోటీలు జరుగుతున్న విషయం విదితమే. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలురు ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయి పోటీలకు బి.సిద్ధార్థ, కె.ప్రవీణ్ కుమార్, ఉదయ్‌కిరణ్, జగదీష్ బెహరా ఎంపి కయ్యారు. మిగిలిన వారిలో డి.ఉదయకిరణ్(విజయనగరం), జి.అఖిలేష్‌కుమార్ (విశాఖపట్నం) ఎంపికయ్యారు. బాలిక విభాగంలో జి.సుప్రియ(అనంతపురం), ఎం.మానస (నెల్లూరు), ఆర్.సంస్కృతి (పశ్చిమ), పి.లావణ్య(తూర్పు గోదావరి), కె.జ్యోతిక(అనంతపురం), బి.గాయత్రి (చిత్తూరు) జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతిభ కనబరచడం ద్వారా ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మల్లా కామేశ్వర రావు, కాంతారావు, సంతోష్, భద్రయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, టంకాల రవిశంకర్ గుప్తా, తారక్, నిర్వాహకులు పి.తవిటయ్య, కె.హరిబాబు, గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కంచిలి: 2008-09 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు



కొత్తూరు: 1993-94 సంవత్సరం నాటి ఉపాధ్యాయులతో..



వజ్రపుకొత్తూరు: 1990-91 నాటి పూర్వ విద్యార్థులు



గార: అంపోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1991-92లో చదువుకున్న విద్యార్థులు



ఆమదాలవలస: 1983-84 నాటి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కొత్తూరు/వజ్రపుకొత్తూరు/కంచిలి/గార/ఆమదాలవలస, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నివగాం, అక్కుపల్లి కంచిలి, గార, ఆమదాలవలస ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఒకరికొకరు పరిచయం చేసుకుని నాటి, నేటి స్థితిగతులను తెలుపుకుని ఆనందం పొందారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. మృతి చెందిన మిత్రులకు సంతాపం తెలిపారు.